క్లుప్తంగా

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పీఎంజేఏవై సికిల్ సెల్ అనీమియా స్క్రీనింగ్ కార్యక్రమం మంగళవారం జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే పిల్లలు పుష్టిగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమణి, కె.తేజస్విని, ఆశా కార్యకర్త సీహెచ్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.ప్రశాంతి, వై.తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్స్ ద్వారా డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వాలి

సత్తెనపల్లి: రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్స్‌ను మళ్లీ పునరుద్ధరించి డీఎస్సీకి బహుజన నిరుద్యోగ యువతీ, యువకులకు వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీపీ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు జె.విజయ్ కుమార్ మంగళవారం డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తుండటంతో దళిత, గిరిజన, మైనార్టీ తదితర వర్గాల వారు ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా పోటీ పరీక్షలకు సన్నద్ధం కాలేక పోతున్నారన్నారు. గతంలో పోటీ పరీక్షలకు ఇదే విధంగా శిక్షణ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే ఇప్పుడు కూడా ప్రతి జిల్లాలో అంబేడ్కర్, జ్యోతి బాపూలే శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతి జిల్లాలో స్టడీ సర్కిల్స్‌కి శాశ్వత భవనాలతో పాటు, హాస్టల్స్, లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. ఆయా విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.15 వేల విలువైన క్రీడాపరికరాల వితరణ



వినుకొండ(నూజెండ్ల): రూరల్ మండలంలోని నాగులవరం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పి.చిన అమరయ్య రూ.15 వేలు విలువచేసే క్రీడా సామగ్రి అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షణ్మోహనరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలు సహకారాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, యల్లమందరావు, శిరీష, దీప్తిలత, పద్మకుమారి, శైలజ, జక్రయ్య , క్రీడాకారులు పాల్గొన్నారు.

వారం రోజులుగా డయేరియా విజృంభణ

- మారుతీ నగర్, లెనిన్ నగర్‌లలో ఎక్కువమంది బాధితులు
- నలుగురు మృతి చెందినా అంతగా స్పందించని యంత్రాంగం



మారుతీనగర్ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు



డయేరియాతో బాధపడుతున్న కార్మికుడు

పిడుగురాళ్ల: పట్టణ పరిధిలోని మారుతీ నగర్, లెనిన్ నగర్ ప్రాంతాల్లో వారం నుంచి డయేరియా బాధితులు రోజు రోజుకు పెరుగుతున్నారు. అలాగే మరణాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. ఇప్పటికే పిడుగురాళ్ల పట్టణ పరిధిలో సుమారు నలుగురు డయేరియాతో మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. మారుతీ నగర్, లెనిన్ నగర్ ప్రాంతాలలో నివసించే వారు ఎక్కువగా కార్మికులు, చేతి వృత్తుల వారే. ఈ ప్రాంతంలో ఒక్కసారిగా డయేరియా విజృంభించటంతో అందరు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు నామమాత్రంగా వచ్చి పరిశీలించి పోతున్నారే కానీ డయేరియాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు, స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి అతిసార వ్యాధి బారిన పడిన వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మారతీ నగర్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నాటికి 41 కేసులు నమోదు అయినట్లు వైద్యులు తెలిపారు. ఇంకా ప్రైవేటు వైద్యశాలల్లో చేరి చికిత్స పొందిన వారు పేదుల సంఖ్యలోనే ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. డయేరియాతో మంగళవారం లెనిన్ నగర్ వాసి ఆంజనేయులు మృతి చెందటం, మూడు రోజుల క్రితం లెనిన్‌నగర్ ప్రభుత్వ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు చనిపోవడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు ఈ ప్రాంతంలోని నీటిని పరీక్షించారు. తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా ప్రబలినట్లు తేల్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోజు రోజుకు డయేరియా బాధితులు మాత్రం పెరుగుతూనే ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాచి వడపోసిన నీటిని తాగండి



మారుతీ నగర్, లెనిన్ నగర్ ప్రాంతాల్లో డయేరియా కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఇప్పటికే 41 కేసులు నమోదు అయ్యాయి. మా ఆరోగ్య కేంద్రం పరిధిలో డయేరియాతో ఒక్క మరణం సంభవించింది. డయేరియాతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. అత్యవసర వైద్య సాయం అవసరమైన వారిని 108 వాహనం ద్వారా నరసరావుపేటకు తరలిస్తున్నాం. ప్రజలు కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలి. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా కడుక్కోవాలి.

– ఎంఎ రవితేజ, ఆరోగ్యకేంద్రం వైద్యులు, మారుతీనగర్

డయేరియా రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందించండి

అధికారులకు టీడీపీ, జనసేన నాయకుల విజ్ఞప్తి



ఆంజనేయులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

పిడుగురాళ్ల: డయేరియా బాధితులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని టీడీపీ, జనసేన నాయకులు అధికారులను కోరారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన బట్టి కార్మికుడు టి. ఆంజనేయులు డయేరియాతో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచనల మేరకు ఆంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించామన్నారు. మారుతీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలకు సందర్శించి డయేరియా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో పూర్తిస్థాయిలో శానిటేషన్ చేసి ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామని పేర్కొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణం భద్రం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు

సత్తెనపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పిడుగురాళ్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రాంబాబు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశానుసారం సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు మోటారు వాహనాల చట్టంపై సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్లలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వాహనదారులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే ప్రమాదాల బారిన పడటమే కాక ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయం కావడం వల్ల చనిపోతున్నారని, అందువల్ల ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. అంతేకాకుండా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు కూడా శిక్షలు పడతాయన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా పొందాలన్నారు.

సకాలంలో వాహనానికి ఇన్సూరెన్స్ చెల్లించాలని, ఇంకా పలు అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, పారా లీగల్ వలంటీర్ కోటా బాబురావు రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్ వల్ల ఉపయోగం, మండల న్యాయ సేవ సాధికార సంస్థ వల్ల ప్రజలకు కలిగే ఉపయోగాలు వివరించారు. సదస్సులో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ వీరబాబు, కానిస్టేబుల్ బాజీ, సాంబిరెడ్డి, స్థానిక పెద్దలు బైరపు తిరుపతిరావు, బండారుపల్లి ప్రసాదరావు, బత్తుల వెంకటస్వామి, లింగిశెట్టి సూరిబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో తనిఖీలు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని పలు గ్రామాల్లో విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో అరుణ మాట్లాడుతూ మాదల, ముప్పాళ్ళ, దమ్మాలపాడు గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో విత్తనాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ల్యాబ్ నుంచి రిపోర్టులు అందిన అనంతరం అమ్మకాలు జరపాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా రైతులకు విత్తనాలకు సంబంధించిన బిల్లులను అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మకాలు జరపాలని, అధిక ధరలకు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేయటం జరుగుతుందన్నారు. రైతులకు నాణ్యమైన, వ్యవసాయ శాఖ అనుమతి పొందిన విత్తనాలనే అమ్మాలని సూచించారు.

వైఎస్సార్ మెమోరియల్ శాఖ గ్రంథాలయ సందర్శన

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ శాఖ గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రంథాలయానికి సంబంధించిన గదుల అద్దెలు సక్రమంగా చెల్లించాలని షాపుల వారిని ఆదేశించారు. నిర్వాహకులను కూడా అక్కడికి పిలిపించి ఈ విషయమై మాట్లాడారు. అద్దె చెల్లించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రజిని తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల ధర్నాను జయప్రదం చేయండి



పిడుగురాళ్ల ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: గురజాల ఆర్‌డీవో కార్యాలయం వద్ద జరగనున్న అంగన్‌వాడీల ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బందికి సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆశా కార్యకర్తలు ఇచ్చిన హామీలకు జీవోను వెంటనే ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ ఛార్జీలు, వేతనాలు పెంచడం వంటి పలు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు గురజాల ఆర్‌డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు గుర్తుచేశారు. ప్రతి ఒక్కరు హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పశువులు... ఆందోళనలో ప్రజలు

- గురజాల పట్టణానికి ఈ చెరువు నీరే ఆధారం
- కలుషితం అయ్యేలా పశువులు సంచరిస్తున్న వైనం
- డయేరియా వంటి వ్యాధుల భయంతో ప్రజలు



చెరువులోకి దిగిన గేదెలు

గురజాల: గురజాల పట్టణానికి తాగునీటిని అందించే చెరువు అది.. కానీ, స్థానికంగా ఉన్న కొందరు నేతల తీరు, అధికారుల నిర్లక్ష్యంతో పశువులు అందులోకి దిగుతున్నాయి. అసలే వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులైన డయేరియా వంటి వాటితో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఒకవైపు పరిశుభ్రమైన నీటిని తాగాలని, వీలైతే కాచి వడపోసి తీసుకోవాలని అధికారులే పలు కార్యక్రమాల్లో చెబుతున్నారు. కానీ ఆచరణలో మాత్రం చెరువు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. టీడీపీ నేతల తీరు వల్లే ఈ సమస్య వచ్చిందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కలుషిత నీరు తాగి ప్రజలు ఒక పక్క డయేరియా బారినపడి అల్లాడిపోతున్నారు. మరో పక్క టీడీపీ నేతలు అనుసరిస్తున్న వైఖరితో గురజాలలో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చెరువు చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేశారు. పశువులు, పందులు ఇతరత్రా జంతువులు చెరువులోకి దిగి నీటిని కలుషితం చేయకుండా రక్షణ చర్యలు చేపట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కొందరు నాయకులు చెరువు చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించారు. దీని వల్ల మేతకు పొలాల వెంబడి వచ్చిన పశువులు మురుగు గుంతల్లో దిగి ఆ తరువాత నేరుగా దూబ చెరువులోకి వెళ్తున్నాయి. ప్రతి రోజు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. చెరువులోకి పశువులు వెళ్లడం వల్ల నీరు కలుషితం అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డయేరియా బారిన పడితే తమ పరిస్థితి ఏంటని కలవరపడుతున్నారు. ఇప్పటికే పిడుగురాళ్ల ప్రాంతంలో పెద్ద సంఖ్యలో డయేరియా కేసులు నమోదు అయ్యాయి. వెంటనే చెరువులోకి పశువులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

చర్యలు చేపడతాం



చెరువులోకి పశువులు ప్రవేశించకుండా చర్యలు చేపడతాం. పగటి పూట కాపలాదారుడిని నియమిస్తాం. దూబ చెరువు పట్టణ ప్రజలకు తాగునీటిని అందిస్తుంది. పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. పశువులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకునేలా సిబ్బందిని ఆదేశిస్తాం.

– అన్నదాత మోహన శ్రీనివాస్, కమిషనర్ , గురజాల

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరిక



వాహనదారుడిని వివరాలు అడుగుతున్న ఎస్‌ఐ అమీర్

కారెంపూడి: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను కారెంపూడి ఎస్‌ఐ కె.అమీర్ హెచ్చరించారు. మితిమీరిన వేగం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అతివేగంతో వాహనాలు నడపొద్దని విజ్ఞప్తి చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని వాహన చోదకులకు జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న వారిని అలా చేయవద్దని హెచ్చరించారు. లారీలు, ట్రాలీలలో కూలీలు పనులకు వెళ్లేటప్పుడు ప్రయాణం చేయొద్దని కోరారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని, మైనర్లకు తల్లిదండ్రులు బైక్ నడిపే అవకాశం కల్పించవద్దని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

'టీకా' కవచం.. రక్షణ జీవితాంతం!

- ప్రాణాంతక వ్యాధులకు టీకాలతో అడ్డుకట్ట
- ప్రతి బుధ, శనివారాల్లో ఉచితంగా అందజేత




కేసానుపల్లి హెల్త్ సెంటర్‌లో చిన్నారులకు టీకాలు వేస్తున్న దృశ్యం

దాచేపల్లి: జీవితాంతం వ్యాధుల నుంచి సంపూర్ణ ఆరోగ్య రక్షణ కావాలంటే టీకాలు వేయించుకోవాలి. ఇవి ఆరోగ్యానికి రక్షణ కవచంలా ఉంటాయి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన శిశువుల వరకు వేయించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయించటం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుంది. నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇలా వేయించుకోకుండా పలువురు వ్యాధులబారిన పడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా వేసే టీకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా ఇస్తున్నారు.

వ్యాక్సిన్‌లు వేసేది ఇలా...

గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలల తరువాత ఒక టీటీ ఇంజక్షన్, అనంతరం ఇంకో నెల వ్యవధిలో మరొకటి వేయించుకోవాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. గర్భిణి ప్రసవం తరువాత ఐరన్ మాత్రలు అందజేస్తారు. అప్పుడే పుట్టిన బిడ్డకి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బి డోస్ వేయించాలి. వీటి వల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేస్తారు. 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడు వాపు, పచ్చ కామెర్ల వంటి వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. 9 నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి. 9 నెలల నుంచి 5 ఏళ్ల వయస్సు వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్–ఏ చుక్కలు తొమ్మిది డోసులు వేయించడం మరువకూడదు. 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీని వేయించాలి. ఐదేళ్లు పూర్తయిన తరువాత డీపీటీ కోసు వేయించాల్సి ఉంటుంది. 10, 16 సంవత్సరాలు పూర్తయితే టీటీ వేయించాలి.

టీకాలతో రక్షణ



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడవచ్చు. టీకాల ఆవశ్యకతపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలి. గర్భిణులు, చిన్నారులు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలి. ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రజలకు నిరంతరం తగిన అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ ఇమ్మడిశెట్టి అమూల్య, పీహెచ్‌సీ, దాచేపల్లి.

పత్తిలో సస్యరక్షణ అవసరం

సాగుపై రైతులకు శాస్త్రవేత్తల సూచనలు



ఫోన్‌లో రైతుల ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: నగర శివారులోని లాంఫాంలో ఉన్న ఏరువాక కేంద్రంలో మంగళవారం తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురం మండలం 113 తాళ్ళూరు, వేములూరిపాడు గ్రామాలకు చెందిన రైతులతో పత్తి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మల్టీ లొకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. నగేష్, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ విభాగం) డాక్టర్ ఎం. వెంకటరాములు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కె. వీరభద్రరావు, పి. మాణిక్యాలరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోన్‌లో రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. యాజమాన్య పద్ధతులను కూడా వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలు, శాస్త్రవేత్తల సమాధానాలు కింది విధంగా ఉన్నాయి...

ప్రశ్న: పత్తి పంటను ఎప్పటివరకూ విత్తుకోవచ్చు, ఆ సమయంలో ఏ ఎరువులు వాడాలి?
(రైతు: జి రమేష్‌బాబు, వేములూరిపాడు)

సమాధాన: పంటను నల్ల నేలలో జులై నుంచి ఆగస్టు వరకు విత్తుకోవాలి. నీటి సదుపాయం ఉన్న ఎర్ర నేలల్లో జూన్ మధ్య వరకు సంకర రకాలను విత్తుకోవాలి. అన్ని ప్రాంతాలకు సిఫారసు చేసిన భాస్వరం ఎరువులను ఒకేసారి ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నుకోవాలి. సిఫారసు చేసిన నత్రజని, పోటాష్ ఎరువులు మూడు భాగాలు చేసి విత్తిన 30, 60, 90 రోజులకు మొక్క మొదళ్లలో 7–10 సెంటీ మీటర్ల దూరంలో పాదులు తీసి వేసుకోవాలి.

ప్రశ్న: పంటను విత్తుకుని 20 రోజులైంది. తుంగ కలుపు నివారణకు మార్గాలు తెలియజేయండి.
(రైతు: ఆర్. లక్ష్మణ్, 113 తాళ్ళూరు)

సమాధానం: తుంగజాతి కలుపు నివారించేందుకు ప్రత్యేక కలుపు మందు ఏమీ లేదు. దీని నివారణకు వేసవిలో దుక్కులు చేసుకోవటంతోపాటు పంటలో అంతర కృషి ఎంతో అవసరం. కూలీలతో కలుపు తీసేయించుకోవాలి. ఖరీఫ్‌లో వర్షాలు ఎక్కువగా ఉండి అంతర కృషి కుదరనప్పుడు ఎకరానికి ఒక లీటరు పెరాక్వాట్ 24 శాతం ఎస్ఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట మీద పడకుండా వరుసల మధ కలుపుపై మాత్రమే పడేలా పిచికారీ చేసుకోవాలి.

ప్రశ్న: పంట విత్తుకుని 15 రోజులు అవుతోంది. పంటలో చంచలాకు, వెడల్పాకు కలుపు, గడ్డిజాతి కలుపు నివారణకు మార్గాలు తెలపండి.
(రైతు: ఎ.శివరామయ్య, 113 తాళ్ళూరు)

సమాధానం: పంటను విత్తుకున్న వెంటనే లేదా ఒకటి రెండు రోజుల్లో 1.0 నుంచి 1.3 లీటర్ల పెండిమిథాలిన్ 38.7 శాతం (స్టాంప్ ఎక్స్‌ట్రా)ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. విత్తుకుని 15 రోజులైతే 25–30 రోజుల వరకు అంతర కృషి చేసి కలుపును నివారించుకోవాలి. వర్షాలు ఎక్కువగా ఉంటే అంతర కృషి అవకాశం లేకుంటే వెడల్పు ఆకు కలుపు నివారణకు ఎకరాకు 250 మిల్లీ లీటర్లు పైరిథయోబాక్ సోడియం 10 శాతం (హీట్‌వీడ్ ధీమ్)ను, గడ్డిజాతి కలుపు నివారణకు 400 మిల్లీ లీటర్ల క్విజలోఫాప్ పి ఇథైల్ 5 శాతం (టర్గాసూపర్)ను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

ప్రశ్న: పత్తిలో గులాబీరంగు పురుగుల నివారణకు ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు తెలియజేయండి.
(రైతు: కె. నాగసురేష్, 113 తాళ్ళూరు)

సమాధానం: గులాబీ రంగు పురుగుల నివారణకు పంటమార్పిడి పద్ధతిని రెండు, మూడు సంవత్సరాలకు ఒకసారి విధిగా పాటించాలి. తక్కువ కాల పరిమితి రకాలను ఎంపిక చేసుకుని సకాలంలో విత్తుకోవటం ద్వారా ఈ పురుగుల ఉధృతిని తగ్గించుకోవచ్చు. పొలం చుట్టూ తుత్తురుబెండ, ఉమ్మెత్త లాంటి ఆతిథ్యమిచ్చే కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. పంట దగ్గరలో బెండ పంట లేకుండా చూసుకోవాలి. పంట కాలంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టటం ముఖ్యంగా సేంద్రియ ఎరువులు, నత్రజని సమతుల్యత పాటించి ఈ పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు. పంటను విత్తుకున్న 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించటానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. ఒక ప్రాంతంలో పత్తిని దఫాలుగా కాకుండా ఒకేసారి విత్తటం ద్వారా పురుగు బెడద తగ్గించవచ్చు. పత్తి మోళ్లను పొలంలో లేదా ఇళ్ల వద్ద వంట చెరకుగా వాడేందుకు నిల్వ చేయకూడదు. నీటి వసతి ఉన్న చోట రెండో పంటగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి.

ప్రశ్న: పత్తి అధికంగా ఎత్తు పెరగకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి?
(రైతు: షేక్ మస్తాన్, 113 తాళ్ళూరు)

సమాధానం: సాగునీటి వసతి ఉన్న పరిస్థితుల్లో అధిక వర్షాలతోపాటు నత్రజని ఎరువులు అధికంగా వినియోగించటం వల్ల పంటలో ఎక్కువగా గొడుగు కొమ్మలు, కాయ కొమ్మలు ఏర్పడతాయి. దీని ద్వారా మొక్కలో తయారయ్యే పిండి పదార్థాలు ఎక్కువగా కొమ్మల అభివృద్ధికి సరిపోతాయి. పూత, పిందె కాయలు రాలటం కనిపిస్తుంది. నివారణకు సైకోసెల్‌ను 60 పీపీఎం మోతాదులో పిచికారీ చేస్తే మొక్కల్లో అదనపు శాఖీయ పెరుగుదల ఆగిపోయి, పిండి పదార్థాలు పూత, పిందె అభివృద్ధికి ఉపయోగపడతాయి. ప్రతి మొక్కకు 15 నుంచి 18 పక్క మొక్కలు వచ్చినపుడు లేదా పత్తి విత్తుకుని 70 రోజులకు మొక్క మీటరు కంటే ఎక్కువ ఎత్తు పెరిగినప్పుడు చివర్లను తుంచాలి. దీనివల్ల పెరుగుదల తగ్గి పక్క కొమ్మలు ఎక్కువై కాపు వస్తుంది.

ప్రశ్న: పత్తిలో వేపపిండి, ట్రైకోడెర్మావిరిడిని కలిపి ఎలా వాడుకోవాలి?
(రైతు: షేక్ మస్తాన్‌వలి, 113 తాళ్ళూరు)

సమాధానం: పంటలో 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండికి 2 కిలోల ట్రైకోడెర్మా శిలీంధ్రపు పొడిని కలిపి 12–15 రోజులు నీడలో ఉంచాలి. ఈ శిలీంద్రం వృద్ధి చెందిన తరువాత ఆఖరు దుక్కిలో చల్లుకుని భూమిలో కలియ దున్నుకోవాలి.

వైభవంగా కోదండరాముడి పదహారురోజుల పండుగ



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ కోదండరామాలయం తొలి వార్షికోత్సవం గత నెల 24న జరిగిన విషయం విదితమే. మంగళవారం పదహారు రోజుల పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారి దర్శి అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహించారు. ఈ ఆలయం సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మాణం కాగా, 2015లో ఆలయ జీర్ణోద్ధరణ చేశారు. రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో ఆలయాన్ని నిర్మించారు. గతేడాది జూన్ 7న శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు తదితరులు నిర్వహించారు.